


11న చంద్రబాబు పర్యటన రద్దు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఈనెల 11వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటన రద్దయినట్లు ఆ పార్టీ జిల్లా వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. శ్రీకాకుళం నగరంలో ఆ రోజున పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల సర్పంచ్‌లతో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ నిర్వహించే సమావేశానికి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొనాల్సి ఉండగా, రావడం లేదని ప్రకటించింది.

బంగారం దొరికింది కానీ...

- సందేహాలను మిగిల్చిన విచారణ
- ఏడుగురు అరెస్టు, ఒకరు పరారీ
- కేసు వివరాలను వెల్లడించిన ఎస్‌పి రాధిక
- తేలని బ్యాంకు అధికారులు, ప్రయివేట్ బ్యాంకుల సిబ్బంది పాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గార బ్రాంచ్‌లో మాయమైన తాకట్టు బంగారం కేసును పోలీసులు ఛేదించారు. గల్లంతైన ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక ఈ కేసు వివరాలను వెల్లడించారు. బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసిన ఉరిటి స్వప్నప్రియ తన అన్న కిరణ్‌తో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం, మైన్స్, రైస్‌పుల్లింగ్, షేర్ మార్కెటింగ్‌లో సొమ్ములు పెట్టి బాగా నష్టపోయింది. దీంతో తన అన్న, బ్యాంకు క్యాషియర్ ముంజి సురేష్‌తో కలిసి డబ్బుల కోసం బ్యాంకులో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను బయటకు తరలించింది. బ్యాంకుకు తరుచూ వస్తున్న లోహితాక్షి లోన్స్ కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వాహకుడు పొన్నాడ తిరుమలరావుతో పరిచయం చేసుకుని, తన అన్న కిరణ్‌కు రాజకీయ నాయకులు, అధికారులతో సంబంధాలు ఉన్నాయని, ఎక్కువ కమీషన్ ఇస్తామని ప్రలోభాలకు గురిచేశారు. మొదటి విడతగా గతేడాది సెప్టెంబరులో వంద గ్రాముల బంగారు ఆభరణాలను తిరుమలరావుకు ఇవ్వగా, శ్రీకాకుళంలోని ఫెడరల్ బ్యాంకులో ఆయన రూ.నాలుగు లక్షలకు తాకట్టు పెట్టారు. అందుకు స్వప్నప్రియ రూ.మూడు వేలు కమిషన్ ఇచ్చారు. ఇలా ఆమె పలుదఫాలుగా ఇచ్చిన బంగారు ఆభరణాలను తిరుమలరావు శ్రీకాకుళం నగరంలోని ఫెడరల్ బ్యాంకు, సిఎస్‌బి, అరసవల్లి, ఆమదాలవలసలోని సిఎస్‌బి బ్యాంకుల్లో వేర్వేరు వ్యక్తుల పేర్లతో తాకట్టు పెట్టాడు. లోన్, వడ్డీ కింద వచ్చిన డబ్బులను స్వప్నప్రియ చెప్పిన వ్యక్తుల ఖాతాల్లో జమ అయ్యేది. ఇలా మొత్తం రూ.2.5 కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి.

ఆభరణాల మాయం విషయం బయటకు పొక్కడంతో, బ్యాంకు నుంచి తరలించిన 86 బ్యాగుల్లో తిరిగి 26 బ్యాగులను బ్యాంకుకు అప్పగించారు. విషయం పెద్దది కావడంతో స్వప్నప్రియ గత నెల 30వ తేదీన ఆత్మహత్య చేసుకున్నారు. అదే రోజున ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, శ్రీకాకుళం ఇన్‌ఛార్జి డిఎస్‌పి విజయకుమార్ ఆధ్వర్యాన రెండు బృందాలను నియమించి కేసు దర్యాప్తు చేపట్టారు. గల్లంతైన మిగతా 60 బ్యాగుల్లో ఉన్న సుమారు రూ.4,07,33,340 విలువ గల 7,146 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరుమలరావుకు గతంలో స్వప్నప్రియ ఇచ్చిన 24.5 గ్రాముల బంగారాన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఆ బంగారానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఆభరణాల మాయంలో తొమ్మిది మందికి భాగస్వామ్యం ఉన్నట్లు గుర్తించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రధాన నిందితురాలిగా ఉన్న స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకోగా, పొన్నాడ తిరుమలరావు, ఉరిటి కిరణ్‌బాబు, సంబాన రాజారావు, కొండాల గణపతిరావు, కాకర్ల తారకేశ్వరరావు, మార్పు వెంకటరమేష్, మొదలవలస మోహన్‌చంద్‌ను అరెస్టు చేశారు. ముంజి సురేష్ పరారీ ఉన్నాడు. ఆయన్నూ అదుపులోకి తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు. ఛేదించిన బంగారాన్ని కోర్టు ద్వారా బ్యాంకుకు, తర్వాత ఖాతాదారులకు అప్పగిస్తామని తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు పురస్కారం, రివార్డులను ప్రదానం చేసి అభినందించారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు బి.విజయ్ కుమార్, కె.బాలరాజు, సిఐలు ఎల్.ఎస్ నాయుడు, బాబ్జీరావు, దాలిబాబు, కామేశ్వరరావు, ఎస్‌ఐలు ప్రసాదరావు, పారినాయుడు, లక్ష్మణరావు, రవికుమార్, గణేష్, విజయ్ కుమార్, ప్రవళ్లిక, లక్ష్మి ఉన్నారు.

విచారణపై అనేక సందేహాలు

బ్యాంకులో మాయమైన బంగారం దొరికేసినా, కేసు విచారణపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో 7,146 గ్రాముల బంగారం మాయమైనట్లు పోలీసులకు బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. డిప్యూటీ మేనేజర్ స్వప్నప్రియ గతంలో లోహితాక్షి లోన్ కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వాహకుడు పొన్నాడ తిరుమలరావుకు ఇచ్చిన 24.5 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని, దాని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్తున్నారు. బ్యాంకులో మాయమైన బంగారం విషయంలో లెక్కలు తేడా వస్తున్నాయి. కేసుకు సంబంధించి పోలీసులు ఇచ్చిన నోట్‌లోనూ పరస్పర విరుద్ధ అంశాలు ఉన్నాయి. మొదటి పేరాలో మాయమైన బంగారం 7,146 గ్రాములు అని, దాని విలువ రూ.4,07,33,340 పేర్కొనగా, చివరి పేరాలో 7,196 గ్రాములు అని, దాని విలువ రూ.4,10,12,340గా పొందుపరిచారు. బంగారం బ్యాగుల సంఖ్య (60) మాత్రం సరిపోయింది. అధికారులు బంగారం భద్రపరిచే రూమ్‌లో స్వప్నప్రియ ఒంటరిగా ఉండడాన్ని చూసి, కస్టోడియన్‌గా ఉండాల్సిన క్యాషియర్ ముంజు సురేష్ ఎందుకు లేరని బ్యాంకు మేనేజర్ చెల్లాపు రాధాకృష్ణ అడిగినట్లు పోలీసులు చెప్తున్నారు. ఆమె సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో, బ్యాంకులో ఉన్న బంగారం బ్యాగులను తనిఖీ చేయగా, 86 బ్యాగులు లేనట్లు మేనేజర్ చెప్పినట్లుగా పోలీసులు చెప్పారు. సాధారణంగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో మూడు నెలలకోసారి తాకట్టు బంగారు ఆభరణాలపై ఆడిట్ నిర్వహిస్తారు. బ్యాగుల్లో తీసి మరీ లెక్కించి పరిమాణం ప్రకారం ఉన్నాయో లేదో చూసి భద్రపరుస్తారు. పోలీసులు చెప్పిన ప్రకారం గతేడాది సెప్టెంబరు నుంచి ఈ తంతు సాగుతోంది. ఏడాదికి పైగా గడిచినా ఒక్కసారీ ఆడిట్‌లో వెలుగు చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

వారి సంగతేంటి?

గార ఎస్‌బిఐ నుంచి దొంగతనంగా తీసుకెళ్లిన బంగారమంతా ప్రయివేట్ బ్యాంకులకే చేరింది. వాటిలో సిఎస్‌బి బ్యాంకు పేరే ఎక్కువ వినిపిస్తోంది. ప్రయివేట్ బ్యాంకులో ఎక్కువ రుణం, వడ్డీ వస్తుందన్న ఆశతో చేశారా అన్న చర్చ సాగుతోంది. సాధారణంగా దొంగ బంగారం కొనుగోలు చేస్తే వారిపైనా కేసు నమోదు చేస్తారు. బినామీ పేర్లతో ఖాతాలు తెరిచి తాకట్టు పెట్టించుకున్న బ్యాంకుల్లోని సిబ్బంది పాత్రపై పోలీసులు విచారణ చేయాలని బాధిత ఖాతాదారులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 15న పలాసలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. ఉద్దానం కిడ్నీ రోగుల కోసం రూ.50 కోట్లతో పలాసలో నిర్మించిన వైఎస్ఆర్ సూపర్ స్పెషాలిటీ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, రూ.700 కోట్లతో ఉద్దాన ప్రజల మంచినీటి అవసరాల కోసం నిర్మించిన వైఎస్సార్ సుజలధార పథకాలను సిఎం ప్రారంభిస్తారని, ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సిఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ప్రజలను తరలించడానికి 320 బస్సులను సిద్ధం చేయాలన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ సిఎం జగన్ విశాఖపట్నం నుంచి జిల్లాలోని కంచిలి మండలం మకరాంపురానికి ప్రత్యేక హెలీకాప్టర్‌లో చేరుకుంటారని తెలిపారు. అక్కడ 20 వేల కిలో లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ట్యాంకు వద్ద వైఎస్ఆర్ సుజలధార పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బి ఎస్ఇకి ఆదేశించారు. అక్కడ్నుంచి కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు హెలీకాప్టర్‌లో చేరుకుంటారని, తర్వాత రైల్వే మైదానంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. వర్షం పడితే సభా స్థలంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభకు వచ్చే వారికి మంచినీరు పలాస మున్సిపల్ కమిషనర్, భోజన ఏర్పాట్లను జిల్లా సరఫరాల అధికారి చూడాలన్నారు.

వేదిక వద్ద బారికేడ్ల ఏర్పాటు బాధ్యతను ఆర్అండ్‌బి ఎస్ఇకి అప్పగించారు. ప్రోటోకాల్ ఏర్పాట్లు చూసుకోవాలని పలాస సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. సమావేశానికి వచ్చే లబ్ధిదారులకు వాటర్ బాటిల్స్, భోజన ఏర్పాట్లు చేయాలని జెడ్‌పి సిఇఒ, డిపిఒకు అప్పగించారు. వేదిక వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఇపిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. వేదిక వద్ద జగనన్నకు చెబుదాం, గ్రీవెన్స్ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ సిఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు వేల మంది సివిల్, ఎఆర్ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, ఆర్‌డిఒలు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి - రణస్థలం



దీక్షలో కూర్చొన్న పారిశుధ్య కార్మికులు

మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, బ్యాంకు ఖాతా ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని జె.ఆర్ పురం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుమ్ము, ధూళి, దుర్గంధం, అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిపై పాలకులకు కనికరం లేకపోవడం భాదాకరమన్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో, చాలీచాలని వేతనాలతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షల్లో బంగారి రామారావు, మజ్జి వెంకటసూరి, వేమల భద్రయ్య, కాకినాడ శ్రీను, ఎస్.సోమేషు, రావాడ కన్నబాబు, బంగారి సూరిబాబు, బి.ఆదినారాయణ, కె.వెంకటరమణ తదితరులు కూర్చొన్నారు.

బిసిలకు రాజ్యాధికారం దక్కాలి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వెంగళరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస, కోటబొమ్మాళి

దేశంలో అట్టడుగున ఉన్న వెనుకబడిన కులాలకు రాజ్యాధికారం దక్కాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వెంగళరావు అన్నారు. బిసిల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్రను కోటబొమ్మాళిలో బోయిన గోవిందరాజులు శుక్రవారం ప్రారంభించారు. ఈ యాత్ర కోటబొమ్మాళి, శ్రీకాకుళం నగరం, ఆమదాలవలసలో సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాలు, సభల్లో ఆయన మాట్లాడుతూ ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చిన బిసిలను ఓటర్లుగా భావిస్తున్నాయి తప్ప పాలకులుగా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం 90 మంది అసెంబ్లీ, 13 ఎంపీ స్థానాలను బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా ప్రకటించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిసిలను విస్మరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ ప్రకటించినా, అందులో బిసి మహిళలకు సబ్ కోటా పెట్టలేదని విమర్శించారు. చట్టసభల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు మాదిరిగానే బిసిలకు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి, బిసి మంత్రిని నియమించాలన్నారు. బిసిల సంక్షేమం కోసం బిసిలు ఎక్కువగా ఉన్న వంద నియోజకవర్గాల్లో 40 రోజులు పర్యటించి, తిరుపతిలో అన్ని రాష్ట్రాల్లోని బిసి నాయకులతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ బిసిల సత్తాను అన్ని రాజకీయ పార్టీలకు చూపిస్తామన్నారు. యాత్రకు పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనను చేపట్టి, బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలని సత్యవతి డిమాండ్ చేశారు. యాత్రలో బిసి సంక్షేమ సంఘ జాతీయ కన్వీనర్ పి.నాగేశ్వర యాదవ్, రాష్ట్ర కన్వీనర్ ఎ.నర్సింగరావు, బిసి సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షులు నూకానమ్మ, జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, గజపతిరావు, జి.కృష్ణయాదవ్, బిసి యువజన ప్రచార కార్యదర్శి ఎ.శివప్రసాద్, కృష్ణయాదవ్, చౌదరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు

క్రమపద్ధతిలో పోలీసులకు వీక్లీ ఆఫ్

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రతి పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి వారాంతపు సెలవును క్రమపద్ధతిలో అమలు చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పోలీస్ సంక్షేమ దివస్ నిర్వహించి, సిబ్బంది వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లా పోలీస్ కేంద్రంగా వైద్య శిబిరం సిబ్బంది కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు సిహెచ్.జి.వి ప్రసాద్, కె.శ్రీనివాస్, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్ఐలు, సాయుధ దళాల సిబ్బంది, పట్టణ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి అంగవైకల్యం అడ్డు కాదు

వికలాంగుల శాఖ ఎడి కె.కవిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల, తపన, ఆత్మస్థైర్యం ఉంటే అంగవైకల్యం అడ్డు కాదని వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యాన క్లబ్ సభ్యురాలు కె.ఉషారాణి పుట్టినరోజు సందర్భంగా 50 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కారణాలతో అవయవాలను కోల్పోయిన వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. వికలాంగులు తమ కాళ్లపై తాము నిలబడి పనులు చేసుకునేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ ఇంజినీర్ కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ మాట్లాడుతూ ఉషారాణి పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాన్ని చేయడం గొప్ప విషయమన్నారు. వికలాంగులకు కృత్రిమ చేతులు, కాళ్లు పంపిణీ చేయడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కరణం శోభారాణి, కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, కోశాధికారి అప్పలనాయుడు, జోనల్ చైర్‌పర్సన్ చింతాడ కృష్ణమోహన్, సభ్యులు పాలిశెట్టి మధుబాబు, సాహుకారి నాగేశ్వరరావు, డాడీ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధినేత ప్రభాస్ సూర్య, గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ, న్యూ బ్లడ్ బ్యాంకు శ్రీకాకుళం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికలాంగుల శాఖ ఎడి కవిత

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణాపార్కు వద్ద హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. సుదీర్ఘకాలం వ్యాధిగ్రస్తులైన వారికి క్రమం తప్పకుండా రక్తం అవసరమవుతూ ఉటుందన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో తగిన రక్త నిల్వలు ఉండేలా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్తదాన శిబిరాలు విరివిగా ఏర్పాటు చేయడం ద్వారా రక్తదాన విశిష్టతను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం పెంచాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. ఆరోగ్యమైన వ్యక్తి 65 ఏళ్ల వరకు మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు. రక్తాన్ని దానం చేయడం వల్ల రక్తదాతలకూ ఆరోగ్యకరమైన ప్రయోజనాలుంటాయన్నారు. రక్తదాన కార్యక్రమంలో పాల్గొందాం, ఇతరులకు సాయంగా నిలుద్దాం అని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు మెమొంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిపిఆర్ఒ కె.బాలమాన్ సింగ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు పి.శ్రీకాంత్, చైతన్య, బ్యాంకు మేనేజర్ ఎ.శేఖర్, క్లస్టర్ హెడ్ నర్రా ప్రసాద్, యూనిట్ హెడ్ శశిధర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

20లోగా క్లయిమ్‌ల పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 20వ తేదీలోగా క్లయిమ్‌లను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజు నుంచి ఇప్పటివరకు 45,179 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేసి ఈనెల 20 తేదీ లోపు పరిష్కరించాలని సూచించారు. ఫారం-6 దరఖాస్తులు 15,687, ఫారం-7 దరఖాస్తులు 16,594, ఫారం-8 దరఖాస్తులు 12,898 ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, సవరణల కింద వచ్చాయని వివరించారు. కొత్తగా ఓటర్లుగా నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో సవరణలకు సంబంధించిన పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జాబ్‌మేళాలో 221 మంది ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 221 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాకు జిల్లావ్యాప్తంగా 508 మంది హాజరు కాగా 15 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిక కాని అభ్యర్థులకు స్కిల్ హబ్ శిక్షణా కేంద్రాలకు పంపించి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయిశ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్‌లను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ వెంకట్ ఉజ్వల్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ పద్మావతి, కళాశాల కోఆర్డినేటర్ వాణి కుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎడిఎస్‌డిఇ బి.చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.వంశీకృష్ణ పాల్గొన్నారు.


స్పీకర్‌కు సమస్యను చెప్తున్న వసంతరావు

స్పీకర్ దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించాలని స్పీకర్ తమ్మినేని సీతారాంను ప్రజలు కోరారు. శుక్రవారం మండలంలో మూల సవవాళాపురం గ్రామ పంచాయతీలో స్పీకర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సిరిపల్లి వసంతరావు అనే యువకుడు తనకు 1.47 సెంట్లు భూమి ఉండగా భూ సర్వేలో 2.52 సెంట్లు భూమి ఉన్నట్లు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారని చెప్పారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లను మంజూరు చేయాలని, అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని స్పీకర్‌కు సమస్యను వివరించారు. తురకపేట కాలనీలో రహదారులు, డ్రైనేజీలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని యువకులు కోరాడ నరేష్, నారాయణరావు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ముందుగా మూలస వలాపురం, తురక పేట కాలనీ, వ్యాసులపేట గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింట మంచినీటి కొళాయిలను స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కెవిజి సత్యనారాయణ, వైస్ ఎంపిపి జివి.శివానందమూర్తి, వైసిపి నాయకులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నాళ్లు ఈ నరకయాతన.?

గర్భిణులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి- బూర్జ

దశాబ్దాల కాలంగా పక్కా రహదారికి నోచుకోక అనునిత్యం నడకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రోడ్డుకష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్న గిరిజనులకు నిరాశే ఎదురైంది. మండలంలో వైకుంఠపురం పంచాయతీ పరిధిలో అల్లిపల్లి గూడ గిరిజన గ్రామం కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా తుపాను కారణంగా అల్లిపల్లిగూడ రహదారి దమ్ములమడిగా మారింది. గురువారం భారతి అనే గర్భిణీని పట్టణానికి స్కానింగ్ కోసం తీసుకు వెళుతుండగా ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గతంలో ఇదే రహదారిపై పాఠశాల విద్యార్థులు తీసుకువెళ్తున్న ఆటో బురదలో ఇరుక్కుపోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం గ్రామం నుంచి బయట ప్రపంచానికి రావాలంటే ఉన్న ఒక్క రహదారి అధ్వానంగా మారడంతో అత్యవసర సమయంలో కూడా తాము బయటికి రాలేని పరిస్థితి దాపురించిందని


ఆటోను తోస్తున్న స్థానికులు

గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఐటిడిఎ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ఐటిడిఎ పిఒ స్పందించి గ్రామానికి రహదారిని బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదివాసి నాయకుడు శోభన్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


సాయి యశ్వంత్(ఫైల్)

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక వెంకటేశ్వర కాలనీకి చెందిన బెండి సాయి యశ్వంత్ (23) మృతి చెందిచాడు. పోలీసుల వివరాల మేరకు సాయి యశ్వంత్ తన ద్విచక్రవాహనంపై జగతిమెట్ట నుంచి టెక్కలి వైపు వస్తున్న క్రమంలో పాతజాతీయ రహదారిపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా యూ టర్న్ తీసుకుంటున్న ఓ ఆటోను బలంగా ఢీకొని రోడ్డు మీద పడిపోవడంతో ఈ క్రమంలో వెనుక నుండి టెక్కలికి చెందిన ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల బస్సు వెనుక టైరు యువకుడు మీద నుండి వెళ్ళిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. యువకుడిని స్థానికులు హుటాహుటిన స్థానిక జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో యువకుడు తల్లి రోధిస్తుంది. యువకుడు తండ్రి కృష్ణారావు కొన్నేళ్ళ క్రితం మృతిచెందగా తల్లి ఉమామహేశ్వరి ఉన్నారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

సంక్షేమ రథసారథి జగన్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ సంక్షేమ రథసారథి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర పశు సంవర్థక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మంచినీళ్ళపేట గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. మండల వైస్ ఎంపిపి వంక రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సంక్షేమం అందించినట్లు చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పొత్తులతో ముందుకు వస్తున్నాయని, ప్రజలు వారి కుయుక్తులను తిప్పి కొడతారన్నారు. 2024 ఎన్నికల్లో ఎవరూ ఊహించని మెజారిటీతో వైసిపి ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మండల వైసిపి అధ్యక్షుడు పి.గురయ్య నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధు కేశవరావు, ఎంపిడిఒ సి.హెచ్. ఈశ్వరమ్మ, డిటి వి.గిరిరాజ్, సర్పంచ్ వంక సత్యరాజ్, మాజీ సర్పంచ్ గోసాల శంభూరావు, పాల్గొన్నారు.


నూతన ఆటోను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

జీవనోపాధికి మహిళాశక్తి ఆటోలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్వయంశక్తి సంఘాల్లోని పేద ఎస్‌సి, ఎస్‌టి మహిళల అభ్యున్నతికి మహిళాశక్తి ఆటోలు తోడ్పాటు అందిస్తాయని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పూండి గోవిందపురంలో మహిళా సంఘం సభ్యులు, నిరుపేద ఎస్‌టి మహిళ గొర్లె ఊర్మిళకు గ్రామీణ ప్రాథమిక నిర్మూల సంస్థ పరిధిలోని ఉన్నతి పథకంలో భాగంగా మహిళా శక్తి ఆటోను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సాధికారత ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమా మహేశ్వరరావు, మహిళా సంఘాల సభ్యులు, కణితి వెంకట భగవాన్, డొక్కటి జానకి రామయ్య పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలో కట్యాచార్యుల పేట గ్రామ సంఘంలో శ్రీ లక్ష్మీ స్వయంశక్తి సంఘ సభ్యురాలైన మన్నేన గాయత్రీకి సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు చేతుల మీదగా శుక్రవారం ఉన్నతి పథకం ద్వారా ఆటోను అందజేశారు. రూ.3 లక్షల 50 వేలు విలువైన ఆటోను కేవలం 10 శాతం లబ్ధిదారుని వాటా, మిగతా 90 శాతం వడ్డీలేని రుణంగా అందిస్తున్నట్లు తెలిపారు. సంఘాల మహిళలకు ప్రభుత్వమే వడ్డీ భరిస్తూ, వారి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు సొంత యూనిట్లను స్థాపించు కోవడానికి ఉన్నతి పథకం ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నట్లు, వైయస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. గ్రామ సంఘం విఒఎ రాజుతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చందర్రావు పాల్గొన్నారు.


మద్యం షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో పిన్నింటిపేట కేంద్రంలో ఉన్న మద్యంషాపులో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉద్యోగులపై కేసునమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ కె.రాజేష్‌కుమార్ తెలిపారు. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పిన్నింటిపేటలో ఉన్న మద్యంషాపును ఎక్సైజ్ ఎస్ఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులో 180 ఎంఎల్ పరిమాణం గల 44 మద్యం సీసాలు కల్తీ జరిగినట్లు గుర్తించారు. సదరు కల్తీ జరిగిన బోటల్స్‌ను స్వాధీనం చేసుకుని కల్తీకి కారణమైన తమ్మినేని గోవిందరావు, బీద పవన్ కుమార్, బరాటం ఉదయ శంకర్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు బి.శ్రీరామమూర్తి, ఎల్.ఉమామహేశ్వరరావు, సిబ్బంది, విఆర్ఒ ప్రమీల పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో ఇసకలపాలెం గ్రామానికి చెందిన కోనేరు లోకేష్ ఆరునెలల క్రితం చెన్నైలో హత్యకు గురై చనిపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఆంధ్రా వలస మత్స్యకారుల సంఘం రూ.2.5 లక్షలు ఆర్థికసాయం శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులకు ఇసకలపాలెంలో అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో ఆంధ్రా వలస మత్స్యకారుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సింహాచలం, నిర్వాసితులు

నిర్వాసితులు పలాసకు తరలిరావాలి

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితులు ఈ నెల 15న సిఎం జగన్మోహన్ రెడ్డి పలాసకు రానున్న దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం తరలిరావాలని వంశధార నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహచలం ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్టూరు బిట్-3లో ఇరపాడులో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంజిఒ నెంబర్ 1632 ప్రకారం గత జూన్ నెలలో రూ.216.77 కోట్లు నిర్వాసితులకు అదనపు పరిహారం ప్యాకేజీ ప్రకటన చేసారని, ఇందులో రూ.189 కోట్లు విడుదల చేశారన్నారు. రూ.149కోట్లు లక్ష చెప్పున నిర్వాసితులకు చెల్లించనున్నారన్నారు. మిగిలిన రూ.40 కోట్లు ఆర్‌బిఐ స్టేజీలో పెండింగులో ఉన్నాయని, రూ.27.71 కోట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉందని అధికారులు చెప్పడం నిర్వాసితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమౌతుందన్నారు. ఫిబ్రవరిలోపు అదనపు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నిర్వాసిత నాయకులు అడవివరపు శ్రీరాములు, బొట్టు లచ్చయ్య, బి.కృష్ణమూర్తి ఉన్నారు.


సురేష్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత

ఘనంగా సురేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- లావేరు

మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం తాళ్లవలసలో ఆయన స్వగృహంలో మండల తెలుగుయువత నాయకులు కడుపుకుట్ల రమణ, అలుపాన శేఖర్, అప్పిన గిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం గజమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే సురేష్ జన్మదినం సందర్భంగా మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట రావు సురేష్‌కు ఫోన్‌లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో యు.లక్మణరావు, సంతోష్, ముద్దాడ ఆనంద్ పాల్గొన్నారు


డిఎస్‌పితో మాట్లాడుతున్న రామ్మనోహర్ నాయుడు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలో వాహనదారులు అతివేగంగా ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని, ప్రమాదాల నివారణకు నగరంలోని పలు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్మనోహర్ నాయుడు కోరారు. ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయం, గాంధీ పార్క్, 80 ఫీట్ రోడ్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతో పాటు వైసిపి కాపవరపు సీజు, తోట తారక్, ఊడి సునీత, శ్రీధర్ శర్మ, వీనస్ ఆప్టికల్ హరి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా భాగస్వామ్యం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా భాగస్వామ్యం పెంపొందింపజేయాలని మెప్మా పి.డి ఎం.కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమీక్షించారు. ఇందులో భాగంగా జగనన్న కాలనీ లే అవుట్లలో ఇండ్ల నిర్మాణాల పురోగతి, రూ.35 వేలు అదనపు రుణం మంజూరు, పట్టణ ప్రగతి యూనిట్ ఏర్పాటు, ఆడుదాం ఆంధ్రాలో ఔత్సాహిక క్రీడాకారుల నమోదు, టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు రుణాల అనుసంధానం, జగనన్నతోడు లక్ష్యాలపై సిబ్బందితో సమీక్షించారు. సమీక్షలో హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు, మెప్మా జిల్లా కార్యాలయ సిబ్బంది బి.రామారావు, బి.భాస్కరరావు, పి.విజయకుమారి, కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్ కుమార్

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, తీగలు అమర్చుటలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. పాల పోలమ్మ గుడి, కామేశ్వరి కళ్యాణ మండపం, మెయిన్ రోడ్ కొంత భాగం, వర్క్‌షాప్ వీధి, లక్ష్మీ నగర్ వీధి కొంత భాగం, పోలీస్ స్టేషన్ ఎదురు భాగం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.


కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శిరీష

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం మందస మండలం తాల్లగురంటి పంచాయతీ గౌడగురంటి గ్రామానికి చెందిన పలు వైసిపి కుటుంబాలు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ టిడిపిపై నమ్మకంతో వచ్చిన ప్రతిఒక్కరికీ తాను నిరంతరం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైసిపి ఆక్రమణలను బయటపెట్టి ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బోగాడ దేవరాజు, కొండా త్రినాథ్, బౌరి డంబురు, నాయక గోపాల్, కేశవ నాయక్, భౌరి నర్సింగ్, జన్న సింహాచలం, కె.కామరాజు, కె.భీమ్మో, కొండా కురేషి పార్టీలో చేరారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు దుర్యోధన, ప్రధాన కార్యదర్శి రుద్రయ్య, లింగరాజు, ముడిమంచి నవీన్, బిసి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అలాంటి ఓట్లను తొలగించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక శిబిరాలు బూటకమని వైసిపి నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బద్రి రామారావు అన్నారు. శుక్రవారం మూలసవలాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను బిఎల్ఒలు పట్టించుకోవడంలేదన్నారు. పెద్ద సవలాపురంలో మృతులు, వివాహమైన వారు 60 మంది వరకు ఇప్పటికీ ఓటర్లుగా ఉన్నారన్నారు. నవంబరు, డిసెంబరు నెలలో ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌డే నిర్వహించినప్పటికీ తొలగింపులు చేపట్టని అధికారులు తుది జాబితా ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లను గుర్తించి తొలగించాలని ఎన్నికల సంఘం అధికారులు ఆదేశించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అదపాక గౌరు నాయుడు, ఇల్లాకుల సూర్య ప్రకాష్, కోయిలాపు గౌరునాయుడు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి

నందిగాం: కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో విఎఎలు రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. రబీ పంటలకు సంబంధించి జియో టాగింగ్ పూర్తి చేయాలని, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతుల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షులు శ్యామసుందరరావు, ఎంపిడిఒ శివప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, పలువురు సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


నందిగాం: బహుమతి అందజేస్తున్న ఎంపిపి

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- నందిగాం

వికలాంగుల సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి తెలిపారు. శుక్రవారం భవిత కేంద్రం వద్ద వికలాంగుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడారు. వికలాంగ విద్యార్థులు భవిష్యత్‌లో తమ కాళ్ళపై నిలబడే విధంగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లు, వినికిడి యంత్రాలు, నీటి బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు, ఐఇడి ఉపాధ్యాయులు పినకాన రాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రుంకు జనార్ధన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో ముత్యాలమ్మ పేట భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మండల ఎంఇఒ అప్పారావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ ప్రారంభించారు. 10 మంది వినికిడి లోపం విద్యార్థులకు, దృష్టిలోపం గల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వనాథం, వై. కమలాకర్, పిఇటి వజీర్ అహ్మద్, శ్రవణ్ కుమార్, ఉదయ్ కుమార్, పావని, సూర్యం, సోమేష్, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


కవిటి : బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ

కవిటి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగ పిల్లలకు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఐఇఆర్‌పిలు కృష్ణారావు, అరుణ్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలను నియంత్రించాలని ప్రజా ప్రయోజన వాజ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో కుక్కలను నియంత్రించాలని న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు స్థానిక సివిల్ జడ్జి కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రధాన రహదారుల్లో, రైల్వే స్టేషన్ వద్ద గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ ప్రయాణికులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎల్‌సి 23/2023 దాఖలు చేశారు. కుక్కలను నియంత్రించాలని జిల్లా కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు కోర్టు ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్‌కు న్యాయవాది మోహనరావు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులను పంపించారు. కుక్కల బెడద వలన గత ఏడాది 42,336 మంది బాధితులు దాడులకు గురయ్యారని, ఈ ఏడాది బాధితులు ఇంకా పెరిగి ఉంటారన్నారు. పంచాయతీల్లో కుక్కల సంతతి నివారణకు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి బి.రవికుమార్ ఫిబ్రవరిలో ప్రకటించారన్నారు. పలుమార్లు పట్టణ సిటిజన్ ఫోరం పక్షాన మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారని న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు మోహనరావు తెలిపారు.

కులగణనపై అధికారులకు శిక్షణ


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఉదయ్ కుమార్

ప్రజాశక్తి-నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కులగణన సర్వేపై జెడ్‌పిటిసి వసంత రెడ్డి, ఎంపిడిఒ ప్రేమలీల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టనున్న సర్వేతో అన్ని కులాల వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామస్థాయిలో కులగణన ఏ విధంగా చేపట్టాలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, వైసిపి మండల అధ్యక్షుడు జీరు బాబురావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నిమ్మన దాస్ అధ్యక్షతన కులగణనపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, వివిధ కుల సంఘాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, సర్పంచ్ నగిరి ప్రభావతి, కుల సంఘ నాయకులు రత్నాల శ్రీనివాసరావు, చింతా ప్రకాశరావు, పొడుగు కామేష్, రామ్మోహన్ పాత్రో, సాహుకారి దివాకర్‌రావు, గుర్రాల శ్రీనివాసరావు, మరల శంకరరావు, దున్న మాధవరావు, బైపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: సమాజంలో కులాల స్థితిగతులను తెలుసుకొని వారి సామాజిక అభివృద్ధి కోసం కులగణన చేపట్టడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కులగణనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టేటప్పుడు ప్రతి ఇంటికి వెళ్లి


సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాస్

సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కులగణన కోసం ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు.
కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు త్రినాధరెడ్డి, సర్పంచ్‌లు దున్న బాలరాజు, మామిడి భాస్కరరావు, పిట్ట గీతారాణి, కొల్లి భాస్కరరావు, హేమారావు, తుంగణ సుశీల, కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు చేపడతాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

అధ్వానంగా రోడ్లు అనే శీర్షికతో ఈనెల 6న ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. ఈ వార్త స్పందనగా శుక్రవారం కోటబొమ్మాళి ఆర్అండ్‌బి ఎఇ సరోజా మేఘవరం నుంచి బోరు భద్ర వెళ్ళే రోడ్డు పరిశీలించారు. రెండురోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడానికి నిధులు కొరత ఉందని ఆమె తెలిపారు.


కొల్లిపాడు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎఇ సరోజ

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండలం బొగిడియాపుట్టుగ గ్రామంలో జిజిఎంపి నిధులు రూ.2.5లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని జెడ్‌పి చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా, అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఇచ్చాపురం ఎఎంసి చైర్మన్ ఎన్ నరేంద్ర, సర్పంచ్ లక్ష్మి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు


సంక్షేమ పథకాల బోర్డు వద్ద అధికారులు, వైసిపి నాయకులు

వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం

ప్రజాశక్తి- పొందూరు

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మరలా రానున్న ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ అన్నారు. మండలం తాడివలస గ్రామంలో శుక్రవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అందజేసిన సంక్షేమ పథకాలను తెలియజేసే బోర్డులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, మాజీ సర్పంచ్ తమ్మినేని వాసుదేవరావు, ఎంఎల్ఒ మోహనరావు, పోలయ్య, వైసిపి మండల మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి, నాయకులు కె.రాజారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి నిర్వీర్యం

ప్రజాశక్తి- పొందూరు

పంచాయతీ నిధులను దారి మళ్లించి పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేసినందుకా మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు కోరుకోవాలా అంటూ తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమం పేరుతో పంచాయతీల నిధులను పక్కదారి పట్టించి గ్రామాల అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం కుంటుపర్చిందన్నారు. తాడివలస పంచాయతీని ఏమి అభివృద్ధి చేసారో వైసిపి నాయకులు చెప్పాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రెట్స్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వర్ణభారత జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ఆదిత్య జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. మానవ హక్కుల ప్రాముఖ్యత, దేశ ప్రగతికి నువ్వు ప్రధాని అయితే, ఓటు వజ్రయుధమా, గొప్ప జీవితానికి జీవితకాలం ఎలా ఉపయోగించుకోవాలి అన్న అంశాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను మానవ హక్కుల దినోత్సవం ముగింపు రోజు ఇవ్వనున్నట్టు హ్యూమన్ రైట్స్ కమిషన్ నియోజకవర్గ అధ్యక్షులు దక్కత కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కెసి పూరి, చాటల తులసీదాస్ రెడ్డి, సందీప్, త్రినాథ్, శివ ప్రసాద్, రవణ పాల్గొన్నారు.



రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అన్నాజీరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మిచౌంగ్ తుపానుతో పంటను నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో తుపానుతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు పి.సూర్యనారాయణ పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను వలన పంట నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొడ్డేపల్లి గోవింద గోపాల్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు లఖినేని సాయిరాం, సనపల వాసుదేవరావు, పప్పల అప్పారావు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న వామపక్ష నాయకులు

రైతాంగాన్ని ఆదుకోవాలి

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- పలాస

మిచౌంగ్ తుపానుతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వామపక్షాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలాస నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, అఖిల భారత వ్యవసాయ కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు మాట్లాడుతూ ఇప్పటికే వర్షాభావంతో, సాగునీరందక కరువు కోరల్లో రైతులు చిక్కుకున్నారని, వేసిన పంటలను వదులుకోలేక మోటారు ఇంజిన్లతో నీరు పెట్టి పెట్టుబడులు పెట్టడంతో ఖర్చులు అధికమయ్యాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పంట చేతికొస్తున్న సమయంలో తుపానుతో ధాన్యం తడిసి రంగు మారాయని చెప్పారు. అటువంటి వాటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పాడైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, వ్యవసాయ రుణాలు మాఫీ చేసి, ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనే మళ్లీ సిఎం కావాలని పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చీమలవలస గ్రామంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పొందుపర్చి 99.5 శాతం హామీలను అమలు పర్చిన ఏకైక సిఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. మండలాల్లో ప్రజలకు అందే సేవలను సచివాలయాల ద్వారా మన ముంగిటకు తీసుకువచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పలు సంస్కరణలను తీసుకువచ్చిన జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, గురుగుబెల్లి సుదర్శనరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న భవానీ శంకర్

జగనన్నకు చెబుదాంపై సమీక్ష

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్పందనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారునికి సమగ్ర సమాచారం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి.భవాని శంకర్ అధికారులకు ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, మండల పరిషత్ ఎఒ తిరుపతి పట్నాయక్, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, ఎపిఎం లలిత, ఇసి ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


గోవిందరావును వాహనంలో తరలిస్తున్న వాసు

ఎండియు ఆపరేటర్ మానవత్వం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో కుంటిభద్ర గ్రామానికి చెందిన ఎండియు ఆపరేటర్ దుంపల వాసు ఆ గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తుండగా రేషన్ డిపో ఎదురుగా గులివిందల గోవిందరావు స్పృహ కోల్పోవడంతో వెంటనే ఆయనను ఎండియు వాహనంలో శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమయానికి స్పందించి ఆస్పత్రికి తరలించటంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది అభినందించారు. విధి నిర్వహణలో మానవత్వం చాటుకోవడంతో ఎండియు అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ వాసును ఫోన్ ద్వారా అభినందించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఎపి ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఎచ్చెర్ల నియోజకవర్గం అధ్యక్షులుగా రణస్థలం టివెంకిల్ స్కూల్ యాజమాని సిహెచ్ శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వేణు (రవితేజ స్కూల్ – లావేరు), గౌరవ అధ్యక్షులుగా ఎస్‌పి వి.రమణ (ఎస్‌విఎస్ స్కూల్ – ఎచ్చెర్ల), సెక్రటరీగా వి. ప్రసాదరావు (సత్యసాయి స్కూలు–జి సిగడాం), జాయింట్ సెక్రెటరీగా పి.సురారెడ్డి(విశ్వశాంతి స్కూల్–ఎచ్చెర్ల), జాయింట్ సెక్రెటరీ 2గా కె.రమణ (సక్సెస్ స్కూల్ – రణస్థలం), ట్రెజరర్‌గా కె.శ్రీరామమూర్తి (గౌతమ్ హైస్కూల్ –ఎచ్చెర్ల), సభ్యులు బి. మురళీమోహన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పాఠశాల యాజమాన్యాలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా ఆ సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధి లాలాపేట సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర అవగాహన కార్యక్రమం ఎంఎల్‌ఒ సాయి సందీప్ రెడ్డి నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సందేహాలు తొలగించి అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయం పరిధిలో గృహ నిర్మాణానికి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్‌కు సంబంధించి సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో హౌసింగ్ ఎఇ ప్రసాద్, మెప్మా జానకిరావులకు సూచించారు. నిర్మాణాలు ప్రారంభం చెయ్యని లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భారతి దివ్య, తన వార్డులో ప్రజలు హౌసింగ్‌కు సంబంధించి ఎదుర్కొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ఆర్‌పిలు, సిఒలు సంతోష్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


కోటబొమ్మాళి : భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాలను అందజేస్తున్న జయరాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో చంద్రబాబు పాలన రాకపోతే సామాన్యులు బతకడం కష్టమవుతుందని, ఇప్పటికే రాష్ట్రం మరో 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని, చంద్రబాబును గెలిపించి రాష్ట్రాన్ని కాపాడు కుందామని మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు ఉప్పాడ జయరాం అన్నారు. శుక్రవారం హరిశ్చంద్రపురం గ్రామ పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట అప్పన్న, బమ్మిడి పాల్గునరావు, ఉప్పాడ చలపతిరావు, ఉప్పాడ అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే మండలం చీపుర్లపాడు, కోటబొమ్మాళి, తిలారు, సరియాపల్లి తదితర గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి పోస్టర్లను ప్రజలకు అందజేశారు.

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసాచార్యులపేట గ్రామంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు వద్దాది గురుమూర్తి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పోస్టర్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీపతిరావు

బిజెపి మండల అధ్యక్షునిగా ధనరాజ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


ధనరాజ్

మండల బిజెపి అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన గుంటు ధనరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేశారు. మండలంలో పార్టీ సంస్థ గత నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రాలో బిజెపి నిర్మాణాత్మకమైన పాత్ర పోషిస్తుందన్నారు.

శివ స్వాముల భిక్షాటన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కోష్ట పంచాయతీ పైడిపేటలో శ్రీ వైద్యనాధేశ్వర ఆలయం శివ భక్తులు, ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం పద్మప్రియ ఆధ్వర్యంలో పైడిపేట, కోష్ట, దువ్వానపేట, పతివాడపాలెం, పైడిభీమవరం గ్రామాల్లో భిక్షాటన చేపట్టారు. భిక్షాటన ద్వారా సేకరించిన బియ్యం, నగదును కార్తీక మాసం 4వ సోమవారం వైద్యనాధేశ్వర ఆలయం వద్ద భారీగా అన్న సమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రణస్థలం, కృష్ణాపురం, కొండములగాం, జి.సిగడాం మండలాల శివ స్వాములు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

సీతంపేట: శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ఎంపిడిఒ కె.గీతాంజలి సూచించారు. స్థానిక వైటిసిలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు ఈనెల 7 నుంచి 13 వరకు జరుగుతాయని అందరూ హాజరు కావాలని సూచించారు. ఎపి ఎస్ఐఆర్‌డి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ సచివాలయ సిబ్బంది విధులు, విధానాలు, పనులు గురించి వివరించారు. శిక్షణలో ఐఐపిఆర్‌డి సత్యం, కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సహాయం

సీతంపేట: మండలంలోని మొగధారకు చెందిన బీమల ప్రేమ్ ఏడాది క్రితం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే వి.కళావతి చొరవతో సిఎం రిలీఫ్ ఫండ్ ప్రతిపాదన పంపించి ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేశారు. శుక్రవారం మృతి చెందిన ప్రేమ్ తల్లిదండ్రులు మీనా, వినోద్‌కు ఎమ్మెల్యే రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. ఎంపిపి బి.ఆదినారాయణ, సర్పంచులు తిరుపతిరావు, ఆరిక కళావతి, జడ్పిటిసి ప్రతినిధి రాము, వైస్ ఎంపిపి కె.సరస్వతి, నాయకులు ప్రకాశరావు, భాస్కరరావు, పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని మండల బిజెపి అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు అన్నారు. శుక్రవారం మండలంలో కస్తూరిపాడు పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుమలరావు